

పట్టపగలే పహిల్వాన్ దారుణ హత్య

జహీరాబాద్: పట్టపగలే పహిల్వాన్ హత్యకు గురయ్యాడు. సోమవారం జహీరాబాద్‌లోని వనత్‌బాగ్ కాలనీకి చెందిన పహిల్వాన్ మక్సూద్ (35) ఓ హోటల్‌లో కూర్చున్న సమయంలో దుండగులు కత్తులతో దాడి చేశారు. 8లో

నేడు మహిళా సంక్షేమ దినోత్సవం

జిల్లా కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళా సంక్షేమ దినోత్సవం నిర్వహించనున్నట్లు కలెక్టర్ శరత్ పేర్కొన్నారు. 13న ఉదయం 10 గంటలకు పీఎస్‌ఆర్ గార్డెన్స్‌లో మహిళా సంక్షేమ దినోత్సవాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, సెర్ప్ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, పాల్గొనాలని కోరారు.

33 మందికి కోవిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 33 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని వైద్యసిబ్బంది మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 27మందికి నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

న్యాయశాస్త్ర పట్టభద్రులకు శిక్షణ

సంగారెడ్డి టౌన్: షెడ్యూల్డ్ కులాలకు చెందిన న్యాయశాస్త్ర పట్టభద్రులకు జిల్లాలో పబ్లిక్ ప్రాసిక్యూటర్/ గవర్నమెంట్ ప్లీడర్ల వద్ద జూనియర్లుగా చేర్పించి, 3 సంవత్సరాలు న్యాయశాస్త్రంలో శిక్షణ ఇవ్వనున్నట్లు సంబంధిత శాఖ అధికారులు తెలిపారు. ఈ శిక్షణ కాలంలో స్టయిఫండ్ ఇవ్వనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి జగదీష్ తెలిపారు. 2023 - 24 సంవత్సరానికి గాను ఉమ్మడి మెదక్ జిల్లా యందలి షెడ్యూల్డ్ కులాలకు చెందిన అభ్యర్థులకు (8)సీట్లు కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. జూన్ 13 నుంచి 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు సంబంధిత అధికారులను సంప్రదించొచ్చని తెలిపారు.

ఆర్థిక సాయానికి దరఖాస్తు చేసుకోండి

సంగారెడ్డి టౌన్: జిల్లాలో నివసిస్తున్న వెనుకబడిన వర్గాల్లోని కులవృత్తులకు, చేతివృత్తిదారులకు రూ. లక్ష ఆర్థిక సాయం కోసం ఈ నెల 20 వరకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జగదీష్ సోమవారం తెలిపారు. ఈ పథకానికి 1) నాయిబ్రాహ్మణులు 2) రజకులు 3) నగర/ఉప్పర 4) కుమ్మరి శాలివాహన 5) అవుసలి 6) కంసాలి 7) కమ్మరి 8) కంచరి 9) వడ్ల/ వడ్ర/ వడ్రంగి / శిల్పి 10) క్రిష్ణ బలిజ పూసల 11) మెదర 12) వడ్డెర 13) ఆరే కటిక 14) మేర / దర్జి 15) యంబిసి కులాల అభ్యర్థులు అర్హులని తెలిపారు. కనీసం 18 సంవ్సరాలు నిండి 55 సంవత్సరాల లోపు ఉండాలని, కుల ధ్రువీకరణ మరియు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణులకు రూ.1,50,000/, పట్టణ వాసులకు రూ.2,00,000/లు కలిగి ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో జూన్ 20 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

రేపటి నుంచి ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్



ఎస్పీ రమణకుమార్

సంగారెడ్డి అర్బన్: తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక ప్రక్రియలో భాగంగా తుది రాత పరీక్షలో అర్హత సాధించిన ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభమై 26 వరకు కొనసాగుతుందని ఎస్పీ రమణ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున అర్హత పొందిన అభ్యర్థులు కాల్ లెటర్‌తో పాటు సంబంధిత ధ్రువపత్రాలను తీసుకొని, తమకు కేటాయించిన రోజున, సమయానికి హాజరు కావాలని సూచించారు. ఈ వెరిఫికేషన్ ప్రక్రియలో మొత్తం 7,065 అభ్యర్థుల సర్టిఫికేట్స్‌లను పరిశీలించనున్నట్లు జిల్లా ఎస్పీ రమణ కుమార్ తెలిపారు.

మోగిన బడి గంట

కొండాపూర్(సంగారెడ్డి): వేసవి సెలవుల అనంతరం సోమవారం తిరిగి విద్యా సంస్థలు ప్రారంభమయ్యాయి. దీంతో సెలవులను ఎంతో ఆనందంగా, హుషారుగా గడిపిన విద్యార్థులు తిరిగి బడి బాట పట్టారు. మొదటి రోజు విద్యార్థుల హాజరు శాతం కూడా అంతంత మాత్రంగానే ఉంది. కొంత మంది విద్యార్థులు హుషారుగా పాఠశాలకు రాగా, మరి కొంత మంది చిన్నారులు తల్లిదండ్రుల సహకారంతో పాఠశాలకు చేరుకున్నారు. ఈ నెల 3 వ తేదీ నుంచి బడి బాట కార్యక్రమం నిర్వహించారు. వారం రోజులుగా ఉపాధ్యాయులు గ్రామంలోని ప్రతి ఇల్లు తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పిస్తున్నారు. సోమవారానికి 923 నూతన అడ్మిషన్‌లు రాగా, ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలలకు 1848 అడ్మిషన్‌లు వచ్చినట్లు డీఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొండాపూర్(సంగారెడ్డి): సాంఘిక సంక్షేమ గురుకులాలకు సంబంధించి కళాశాల, పాఠశాలలో అర్హులైన అభ్యర్థుల నుంచి పార్ట్ టైం ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌సీఓ భీమయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో తెలుగు, ఇంగ్లీష్, గణితం భౌతిక, రసాయన శాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రంతో పాటు పాఠశాలలో తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, సైన్స్, సోషల్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా పీఈటీ, పీడీ, స్టాఫ్ నర్స్, అసిస్టెంట్ కేర్ టేకర్లకు కూడా దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పూర్తి విద్యార్హతలతో (జిరాక్స్ సర్టిఫికెట్లు) నేరుగా ఈ నెల 15వ తేదీన ఉదయం 10 గంటలకు కొండాపూర్‌లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో డెమోకు హాజరుకావాలన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న గెస్ట్ టీచర్లు కచ్చితంగా పూర్తి విద్య అర్హతలతో డెమోకు హాజరుకావాలని సూచించారు. ఈ పోస్టులన్నీ తాత్కాలికంగా భర్తీ చేయనున్నట్లు, అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా ఎంపిక ఉంటుందని తెలిపారు.

కౌలు భూములు ప్రియం!

- వానాకాలం సాగుకు ఏర్పాట్లు షురూ
- జిల్లాలో వ్యవసాయ భూములకు డిమాండ్
- భారీగా పెరిగిన కౌలు



అందోల్‌లో ట్రాక్టర్‌తో భూమిని చదును చేస్తున్న రైతు

జోగిపేట(అందోల్): జిల్లాలో వ్యవసాయ భూములకు సంబంధించి కౌలు పెరగడంతో సన్న, చిన్నకారు రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట దిగుబడి పెరగడం వల్ల కౌలు పెంచిన కూడా భూములను తీసుకుంటూ వానకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఎకరాకు కౌలుతో పాటు భారీగా పెట్టుబడి అవుతున్న సాగుకే మొగ్గు చూపుతున్నారు. రెండు పంటలు పండే భూములకు భారీగా ధర పెట్టి కౌలుకు తీసుకుంటున్నారు. మంజీరా పరివాహక ప్రాంతంలో ఉన్న భూములకు ఎక్కువ మొత్తంలో ఖర్చు చేస్తున్నారు. సారవంతమైన భూములు కావడం, దిగుబడి కూడా అధికంగా వస్తుండడంతో డిమాండుకు అనుగుణంగా కౌలును పెంచుతున్నారు.

పంట దిగుబడి ఎక్కువ

జిల్లాలో ప్రతీ ఏడాది వ్యవసాయ సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ సీజన్‌లో 7.40 లక్షల విస్తీర్ణంలో పంటలు పండించే అవకాశం ఉంది. ఈ ప్రాంతంలో వరి, పత్తి పంటలను పండిస్తున్నారు. అదే స్థాయిలో భూములకు డిమాండ్ ఎక్కువవుతోంది. ఎక్కువగా వ్యాపారులు, ఉద్యోగులు, ఎన్‌ఆర్‌ఐలు భూములపై పెట్టుబడి పెడుతున్నారు. మరీ ముఖ్యంగా రోడ్ల వెంట ఉన్న భూములను కొనుగోలు చేస్తున్నారు. దూర ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు ఆ భూములను కౌలుకు ఇస్తున్నారు. వ్యవసాయం చేసే పరిస్థితి లేక పోవడంతో డిమాండ్‌కు అనుగుణంగా ఆయా గ్రామాల పరిధిలోని రైతులకు కౌలుకు ఇస్తున్నారు. అన్ని భూములకు బోర్ సౌకర్యంతో పాటు సింగూరు ప్రాజెక్టు, ఇతర ప్రాజెక్టులు ఉండడం, వాటికి సాగునీరు అందడంతో ఈ భూములకు డిమాండ్ పెరగడం మరోకారణం. ఆయా సీజన్లను బట్టి దిగుబడి కూడా ఎక్కువ రావడం, కొత్త వంగడాల వైపు ఆసక్తి చూపడం వల్ల గిట్టుబాటు అవుతుండడంతో రైతులు మొగ్గుచూపుతున్నారు. జిల్లాలో 75శాతం వరకు వరిసాగే చేస్తున్న రైతులు రెండు పంటలు పండే భూములకు ఎక్కువమొత్తంలో వెచ్చిస్తున్నారు.

సాగునీరు అందుతుంది

జిల్లాలోని బోధన్ డివిజన్ పరిధిలో కౌలు భూములకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతంలో ఎక్కువగా వరి సాగు చేస్తున్నారు. సింగూరు ప్రాజెక్టు ఆయకట్టు నీళ్లతో సుమారుగా 55వేలకు పైగా ఎకరాలకు సాగునీరు అందుతుంది. దీంతో ఈ ప్రాంతంలో వరి విస్తీర్ణం పెరిగింది. మంజీరా వెంట ఉన్న మండలాల పరిధిలో కౌలు భూములకు డిమాండ్ ఎక్కువైంది. గత సంవత్సరం రూ.12 వేల నుంచి 15వేల వరకు ఉండగా ఈ సంవత్సరం రూ.20 నుంచి 25వేల వరకు కౌలు చెల్లించాలని భూ యజమానులు డిమాండ్ చేస్తున్నారు.

మంజీర పరివాహక ప్రాంతంలో పెరిగిన డిమాండ్ మంజీర పరివాహక ప్రాంతంలో ఉన్న భూములకు డిమాండ్ బాగా పెరిగింది. జిల్లాలోని అందోల్ నియోజకవర్గం పరిధిలోని పుల్కల్, వట్‌పల్లి, అందోల్, చౌటకూరు, సంగారెడ్డి నియోజకవర్గం పరిధిలోని పటాన్‌చెరువు, జిన్నారం, సదాశివపేట, జహీరాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఎక్కువగా చెరుకు, పత్తి పంటలకు ప్రాధాన్యత నిస్తారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఎక్కువగా పత్తి, వరి, పప్పుదినుసుల పంటలను పండిస్తారు. రెండు పంటలు పండే భూములకు రూ.20వేల నుంచి రూ.25 వేల వరకు కౌలుకు ఇస్తున్నారు. ఒక పంట పండే భూములకు రూ.15వేల వరకు తీసుకుంటున్నారు. రెండు సీజన్లలో పంట పండించే కౌలు పెట్టుబడి పోనూ కొంత మిగిలే అవకాశం ఉండడంతో రైతులు సాగునీటి వసతి ఉన్న భూములను తీసుకుంటున్నారు. గడిచిన నాలుగేళ్లుగా వర్షాలు ఉండడం, రెండు పంటలు పండుతుండడంతో కౌలు ధరలు పెరుగుతున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

> **రూ.20వేలు అడుగుతున్నారు**
>
> 
>
> అందోల్ మండలం కన్‌సాన్‌పల్లి గ్రామ పరిధిలో గత సంవత్సరం రూ.14వేలకు ఎకరా చొప్పున భూమిని కౌలుకు తీసుకోగా, ఈ సంవత్సరం రూ.20వేలు అడుగుతున్నారు. ఈ సంవత్సరం కౌలు ధరలు విపరీతంగా పెంచుతున్నారు. గత మూడు సంవత్సరాల కిత్రం రూ.10వేల నుంచి రూ.12వేలకే ఇచ్చే వారు.
>
> - మల్లేశం, రైతు, కన్‌సాన్‌పల్లి

సర్వర్ డౌన్.. తహసీల్దార్ కార్యాలయంలో నిరీక్షణ



నారాయణఖేడ్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరీక్షిస్తున్న జనం

నారాయణఖేడ్: సర్వర్‌డౌన్‌తో నారాయణఖేడ్ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన వారికి సోమవారం నిరీక్షణ తప్పలేదు. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంటున్నట్లు దరఖాస్తు దారులు వాపోతున్నారు. విద్యాసంస్థల పునఃప్రారంభం కావడంతో కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టు తిరగాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు ప్రభుత్వం బీసీ కుల, చేతివృత్తులవారికి రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందించేందుకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. వారు కూడా ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయాల్లో పడిగాపులు గాయాల్సి వస్తుంది. ఈ నెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలనే నిబంధన ఉంది. దీంతో ఆయా ధ్రువపత్రాల కోసం మీసేవ కేంద్రాల్లో నమోదు చేసుకొని తహసీల్దార్ కార్యాలయాలకు జనం పెరుగుతున్నారు. దరఖాస్తు చేసుకునే వారు పెద్దసంఖ్యలో దరఖాస్తులను సమర్పించడంతో సర్వర్లు మొరాయిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

మైక్రో బయాలజిస్ట్, ఫార్మాసిస్ట్ పోస్టులకు జూన్ 15న ఇంటర్వ్యూలు

కలెక్టర్ డాక్టర్ శరత్



సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మైక్రోబయాలజిస్ట్(1), ఫార్మసిస్ట్ (1)పోస్టునకు కాంట్రాక్ట్ పద్ధతిన నియామకాలకు ఈ నెల 15న ఉదయం 10:00 గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ శరత్ సోమవారం తెలిపారు. మైక్రో బయాలజిస్ట్ పోస్టునకు ఉదయం 10:00 నుంచి 11:30 గంటల వరకు, ఫార్మసిస్ట్ పోస్టునకు మధ్యాహ్నం 12 గంటల నుంచి 2:00 గంటల వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. మైక్రో బయాలజిస్ట్ పోస్టుకు ఎండీ మైక్రో బయాలజీ విద్యార్హత గలవారు అర్హులన్నారు. నెలకు రూ. లక్ష రూపాయల వేతనం లభిస్తుందని తెలిపారు. ఫార్మాసిస్ట్ పోస్టునకు, బీ ఫార్మసీ/డీ ఫార్మసీ విద్యార్హత ఉండాలన్నారు. నెలకు రూ.17,500 వేతనం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు విద్యార్హతల ఒరిజినల్స్ మరియు జిరాక్స్ ప్రతులు రెండు సెట్లు తీసుకుని నిర్ణీత సమయంలోగా సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ చాంబర్లో నిర్వహించు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ అన్నారు. సోమవారం జహీరాబాద్‌లోని డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు సబ్సిడీపై జనుము, జీలుగ, సోయాబీన్ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అవసరమైన విత్తనాలను, ఎరువులను సబ్సిడీపై అందిస్తోందన్నారు. సీఎం కేసీఆర్ ముందు చూపుతో రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేదని తెలిపారు. అవసరం మేరకు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఏడీఏ భిక్షపతి, ఆత్మ చైర్మన్ పెంటారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు గుండప్ప, విజయ్‌కుమార్, మచ్చేందర్, అల్లాడి నర్సింహులు, మంకాల్ సుభాష్, నీల వెంకటేశం, మొహియొద్దీన్, శ్రీకాంత్‌రెడ్డి, సంగమేశ్వర్, వెంకటేశం, పురుషోత్తం రెడ్డి, నర్సింహాగౌడ్, సతీష్, వైజ్యనాథ్, నామ రవి కిరణ్, బాబీ, ప్రభు, సత్యం, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్డీఓ

జహీరాబాద్ ఆర్డీఓగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన వెంకారెడ్డి సోమవారం ఎమ్మెల్యే మాణిక్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆర్డీఓను మాణిక్‌రావు శాలువా కప్పి సత్కరించారు.



సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

దళితులు ఆర్థికంగా ఎదగాలి

అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభిస్తున్న క్రాంతికిరణ్

జోగిపేట(అందోల్): దళితులు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే క్రాంతికిరణ్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, పేర్కొన్నారు. డాకుర్ బైపాస్ రోడ్డు సమీపంలో డాకూర్ మాజీ సర్పంచ్ శంకరయ్య నూతనంగా ఏర్పాటు చేసుకున్న శ్రీ శంకర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను సోమవారం సంగారెడ్డి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి, అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు మఠం బిక్షపతి, మాజీ మార్కెట్ చైర్మన్లు నాగభూషణం, మల్లికార్జున్ గుప్తా, మండల అధ్యక్షుడు లక్ష్మీకాంత రెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యుడు లింగాగౌడ్, జోగిపేట కౌన్సిలర్లు కోరబోయిన నాగరాజు, దుర్గేష్, డాకూర్ మాజీ ఎంపీటీసీ కళాలి రమేష్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ అర్జునయ్య, మాజీ కౌన్సిలర్ లక్ష్మణ్, ఉన్ని సంఘం చైర్మన్ క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ దేశానికి రోల్‌మోడల్

- ఆరోగ్య తెలంగాణ దిశగా అడుగులు
- ఎంపీ బీబీ పాటిల్
- ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి

సంగారెడ్డి మున్సిపాలిటీ: తెలంగాణ రాష్ట్రం దేశానికి రోల్‌మోడల్ అని, ఆరోగ్య తెలంగాణ దిశగా పయనిస్తుందని ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం తెలంగాణ రన్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో యువజన, క్రీడల శాఖ భాగస్వామ్యంతో నిర్వహించారు. సంగారెడ్డి ఎస్పీ, ఎంపీ బీబీ పాటిల్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగమిస్తుందన్నారు. ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన రన్‌లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో పరిపాలన మరింత చేరువైందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ పేర్కొన్నారు.



రన్‌లో ఎంపీ బీబీ పాటిల్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, కలెక్టర్ శరత్, ఎస్పీ, చింతా ప్రభాకర్

పోలీస్ వ్యవస్థ పటిష్టం..

జిల్లా ఎస్పీ రమణ కుమార్ మాట్లాడుతూ ఒకప్పటి పోలీస్ వ్యవస్థకు ఇప్పటికీ చాలా తేడాలొచ్చాయన్నారు. ప్రస్తుతం ఒక్క ఫోన్ కాల్‌తో పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత అభివద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, డీఆర్‌ఓ నగేశ్, ఆర్డీవో రవీందర్ రెడ్డి, డీఎస్పీ రవీందర్ రెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ఉత్సవాల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలంలోని కొత్తపల్లి గ్రామంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర సోమవారం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వామివారి సన్నిధిలో నిర్వహించిన పూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలన్నారు. జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ ప్రవీన, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో చిట్కుల్ సర్పంచ్ నీలంమధు

భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఉత్సవాలకు చిట్కుల్ సర్పంచ్ నీలం మధు హాజరయ్యారు. నిర్వాహకులు, ముదిరాజ్ సంఘం నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రార్థన మందిరాలు, ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో మెథడిస్ట్ చర్చి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఆర్ సంస్థ సహకారంతో చర్చి నిర్మాణానికి రూ.70లక్షల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 170కి పైగా దేవాలయాలతో పాటు చర్చిలు, మసీదులు, దర్గాలు నిర్మించినట్లు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పనగేష్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పరమేష్‌యాదవ్, తొంట కృష్ణాకాంత్, చర్చి ప్రతినిధులు శామ్యూల్ విన్‌య్‌కుమార్, ప్రశాంత్ పాల్గొన్నారు.

సరిహద్దులో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు



రైలులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

జహీరాబాద్: చిరాగ్‌పల్లి వద్ద గల రాష్ట్ర సరిహద్దులో సోమవారం ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి మద్యం రాష్ట్రంలోకి అక్రమంగా తరలిరాకుండా ఉండేందుకు గాను తనిఖీలు చేపట్టారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించారు. రాష్ట్రంలోకి అక్రమంగా మద్యం వస్తున్నదనే సమాచారంతో తనిఖీలు ముమ్మరం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. 65వ జాతీయ రహదారిపై రాష్ట్రంలోకి వచ్చే వాహనాలను తనిఖీ చేస్తున్నారు. రైళ్లలో సైతం తనిఖీలు చేశారు. తనిఖీలు రెగ్యులర్‌గా కొనసాగుతాయన్నారు. తనిఖీల్లో సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐలు విశ్వనాథ్, శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమేశ్

కొండాపూర్(సంగారెడ్డి): ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డిలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్‌లో విచ్చలవిడిగా ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు రూ.40 వేల నుంచి రూ.2లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. బస్సు ఫీజు పేరుతో 4 కిలోమీటర్ నుంచి 10 కిలోమీటర్ల వరకు రూ.20 వేల నుంచి 30 వేల వరకు ఫీజులు దండుకుంటున్నారన్నారు. ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి బుక్స్, యూనిఫామ్ పేరుతో రూ.8 వేల నుంచి 2,200 వరకు వసూలు చేస్తూ పేద, మధ్య తరగతి విద్యార్థి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్న పాఠశాలల యాజమాన్యలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మహేష్, సహాయ కార్యదర్శి రజినీకాంత్ పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న సురేశ్ షెట్కార్

నారాయణఖేడ్: పెద్దశంకరంపేట మండల పరిధిలోని చీలపల్లికి చెందిన జగ్గు రవీందర్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు కాంగ్రెస్ సభ్యత్వాన్ని కలిగి ఉండటంతో బీమా కింద రూ.2లక్షలు మంజూరయ్యాయి. మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షులు సురేశ్ షెట్కార్ సోమవారం ఖేడ్‌లోని తన నివాసంలో మృతుడి తండ్రి సంగారెడ్డికి బీమా చెక్కును అందజేశారు. జెడ్పీ ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్, కాంగ్రెస్ ఓబీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాయిని మధు, పట్టణ అధ్యక్షుడు గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

మెదక్ కలెక్టరేట్: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో మెదక్ జిల్లా మెతుకుసీమ అంటూ ఎస్‌జీఎస్ నెట్‌వర్క్ సభ్యులు రూపొందించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, మెతుకుసీమ నెట్‌వర్క్ అధ్యక్షుడు కై లాష్, సతీష్ గాండ్ల శ్రీనివాస్, ప్రసాద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్స్‌తో వ్యక్తి మృతి



మెదక్ మున్సిపాలిటీ: ఫిట్స్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన మెదక్ పట్టణంలోని జిల్లా కోర్టు సముదాయం దగ్గర సోమవారం జరిగింది. పట్టణ పోలీస్‌లు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు(40)వయస్సు గల వ్యక్తి ఫిట్స్‌తో మృతి చెందినట్లు తెలిపారు. అయితే ఈ వ్యక్తి వివరాలు ఇంకా తెలియ లేదని, స్థానికులు మాత్రం మృతి చెందిన వ్యక్తి మెదక్ పట్టణానికి చెందిన వ్యక్తిగా భావిస్తున్నారని పోలీసులు చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 24 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా వారికి జరిమానా విధించారు. 22 మందికి రూ.2 వేల చొప్పున, ఒకరికి రూ. 3వేలు, మరొకరికి రూ.5 వేలు విధించారన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

జహీరాబాద్ టౌన్: పట్టణంలో ఓ బావి వద్ద సోమవారం గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు జహీరాబాద్ టౌన్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. పస్తాపూర్‌నకు చెందిన సుభాష్ వ్యవసాయ బావి వద్ద 40 సంవత్సరాల వయస్సు కలిగిన శవం ఉన్నట్టు పోలీసులకు సమాచారం వచ్చిందన్నారు. వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వారు బయటకు తీయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఏడుపాయలలో మునిగి వ్యక్తి మృతి



అభిలాష్ (ఫైల్)

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల ప్రాజెక్టులో పడి మునిగి ఒకరు మృతి చెందాడు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ పట్టణానికి చెందిన మక్కల అభిలాష్(23) పాలకేంద్రంలో పనిచేస్తున్నాడు. ఆదివారం తోటిపనివారితో కలిసి ఏడుపాయల వనదుర్గ ఆలయానికి వచ్చాడు. దర్శనం తర్వాత విందు చేసుకొని ప్రాజెక్టు వద్దకు వెళ్లారు. స్నానం కోసం నీటిలో దిగగా అభిలాష్ నీటిలోకి జారి మునిగిపోయాడు. స్నేహితులు అభిలాష్‌ను కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. పోలీసులు నీటిలో అభిలాష్ జాడకోసం స్థానికుల సాయంతో ప్రయత్నం చేయగా, సోమవారం అతడి మృతదేహం లభించింది. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యారంగలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ అన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలో భాగంగా సోమవారం జిల్లా విద్యాధికారి కార్యాలయంలో విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి వెంకటరాజం, తొగుట మండల శాఖ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, దౌల్తాబాద్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి త్యాగరాజు, సిద్దిపేట రూరల్ మండల ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు శివశంకర్, తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత



సిద్దిపేటకమాన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత తెలిపారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో సోమవారం జరిగిన పలు సైబర్ నేరాలపై సీపీ వివరించారు.

జ్యూవెల్లరీ షాప్ లైసెన్స్ రెన్యూవల్ పేరుతో..

సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం మీ దుకాణ జ్యూవెల్లరీ షాప్ లైసెన్స్ గడువు ముగుస్తుంది వెంటనే రెన్యూవల్ చేసుకోవాలి లేదంటే త్వరలో దుకాణ లైసెన్స్ రద్దు చేయబడుతుంది అని తెలిపాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు భయపడి గుర్తుతెలియని వ్యక్తి సూచించిన ఫోన్ నంబర్‌కు ఆన్‌లైన్‌లో రూ.10,810 పంపించాడు. తర్వాత మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి వెరిఫికేషన్ చేసుకోగా సైబర్ నేరం జరిగినట్లు గుర్తించాడు. వెంటనే బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

క్యూఆర్ కోడ్ స్కానర్‌తో..

సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తాను ఆపదలో ఉన్నానని అత్యవసరంగా డబ్బులు పంపించాలని సహాయం కోరాడు. గుర్తు తెలియని వ్యక్తి క్యూ ఆర్ కోడ్ పంపించగా బాధితుడు అతడి మాటలు నమ్మి ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగా బాధితుడి ఖాతా నుంచి రూ.3,500 డెబిట్ అయినట్లు తన సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు జాతీయ హెల్ప్ లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

తెలంగాణలో మార్పు తెస్తాం



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్

- 14 ఎంపీ సీట్లు సాధిస్తాం
- కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్

కోహెడరూరల్(హుస్నాబాద్): తెలంగాణ రాజకీయాలల్లో మార్పు తీసుకొచ్చే సత్తా బండి సంజయ్‌కు ఉందని కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్ అన్నారు. వికాస్‌తీర్థ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని సముద్రాల గ్రామంలో జరుగుతున్న జాతీయ రహదారి పనులను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎల్కతుర్తి-సిదిపేట జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తయితే 14 గ్రామాలకు మేలు జరుగుతుందన్నారు. పీఎం ఆవాస్ యోజన కింద రాష్ట్రానికి 2.4లక్ష ఇళ్లు, మరుగుదొడ్లు, ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్ అందించామన్నారు. బండి సంజయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్ల కోసం లక్షా 9వేల కోట్లు ఖర్చు చేశామని, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 4వేల కోట్లు తీసుకువచ్చానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ప్రభాకర్, జిల్లాల అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, దూది శ్రీకాంత్‌రెడ్డి, రావు పద్మా, బోయినిపల్లి ప్రవీణ్‌రావు, బొమ్మశ్రీరామ్ చక్రవర్తి, జేఎస్ఆర్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



మాధవి (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): ఓ మహిళ అదృశ్యమైంది.జిన్నారం ఎస్‌ఐ విజయరావు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని జంగంపేట గ్రామానికి చెందిన బొక్క మాధవి ఈ నెల 7న జిన్నారంలో కూరగాయలు తెచ్చేందుకు సంతకు వెళ్లింది. తిరిగి ఆమె ఇంటికి రాలేదు. మాధవికి మతిస్థిమితం సరిగా లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో ఆమె కోసం బంధువుల వద్ద, తెలిసినవారి వద్ద ఆరా తీసినా ఫలితం లేదు. సోమవారం మాధవి భర్త శేఖర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వ్యక్తి ...



జక్కుల చంద్రం

కొండపాక(గజ్వేల్): వ్యక్తి అదృశ్యమైనట్లు త్రీటౌన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు. ఈ సంఘటన కొండపాక మండలంలోని దుద్దెడ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి సీఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన జక్కుల చంద్రం(29) 10వ తేదీన ఓ వ్యక్తికి డబ్బులు ఇచ్చి వస్తానంటూ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన వారిని, బంధువులను అడిగినా ఎలాంటి ఆచూకీ తెలియలేదు. దీంతో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్లో భార్య ప్రతిభ ఫిర్యాదు చేసింది. చంద్రంది ప్రేమ వివాహం. 5 అడుగుల ఎత్తు, ఆకుపచ్చ కలర్ షర్టు, బ్రౌన్ కలర్ ప్యాంటు వేసుకొని ఉన్నాడని ఛామన ఛాయ కలర్, ఎడమ చేతిపై పచ్చ బొట్టు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ సీఐ తెలిపారు.

కుంటను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

దుబ్బాకరూరల్: మండలంలోని బల్వంతాపూర్ గ్రామంలో బూరుగు కుంటను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైటాయించి ధర్నా చేశారు. గ్రామ శివారులోని బూరుగు కుంటను దాని చుట్టూ పక్క వ్యవసాయం చేస్తున్న రైతులు కుంట అంచున మట్టి పోసి అందులోకి చొచ్చుకొని వచ్చి కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. కుంటలో పోసిన మట్టిని తీసివేసి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కుంటను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు, ఇరిగేషన్ శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. కుంట కబ్జా చేసిన వారిపై ఇరిగేషన్ శాఖ ఏఈ రోహిత్ శ్రీవాత్సవ్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఏఈ ఫిర్యాదు మేరకు రెండు టిప్పర్లు, హిటాచి, డోజర్, ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

అమర్‌నాథ్ యాత్ర ఎంతో పవిత్రమైంది

అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు భూపతి



అమర్‌నాథ్ అన్నదాన సేవాసమితి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

సిద్దిపేటకమాన్: ప్రఖ్యాతిగాంచిన తీర్థయాత్రలో అమర్‌నాథ్ యాత్ర ఎంతో పవిత్రమైందని అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు భూపతి అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం అమర్‌నాథ్ అన్నదాన సేవాసమితి కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ.. అత్యంత క్లిష్టమైన అమర్‌నాథ్ యాత్ర నిర్వహించే భక్తులకు భోజన వసతి కల్పించడం తాము చేసుకున్న పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామన్నారు. అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే భక్తుల కోసం సేవా మండలి అమృత్‌సర్ సహకారంతో బాల్తాల్ వద్ద, భోలే బండారి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో పంచతరని వద్ద ప్రత్యేక లంగర్లు ఏర్పాటు చేసి భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన సరుకులు ఈనెల 13వ తేదీన మంగళవారం సిద్దిపేట శరభేశ్వర ఆలయం నుంచి లారీలు బయలుదేరుతున్నాయని తెలిపారు. ఈ సరుకులు తీసుకెళ్లే లారీని మంత్రి హరీశ్‌రావు జెండా ఊపి ప్రారంభిస్తారన్నారు. అదేవిధంగా మంగళవారం శరభేశ్వర ఆలయంలో ఉదయం 8 గంటలకు శివ కల్యాణోత్సవం, 11 గంటలకు వాహన పూజ కార్యక్రమంతో పాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అలాగే అమర్‌నాథ్ వెళ్లే భక్తులందరూ బాల్తాల్ వద్దగల 8వ నంబర్ లంగర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో కై లాసం, మధుసూదన్, పరమేశ్వర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు తేదీని పొడిగించాలి

సిద్దిపేటరూరల్: సీఎం కేసీఆర్ బీసీ కులాలకు చెందిన చేతివృత్తుల వారికి అందివ్వనున్న రూ.లక్ష సాయం పథకం దరఖాస్తుల తేదీని పొడిగించాలని నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు యాద నరేందర్ అన్నారు. సోమవారం సీఎం కేసీఆర్ అందిస్తున్న రూ.లక్ష సాయం సంబంధిత పలు మార్పుల విషయంలో ప్రజావాణిలో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పథకం దరఖాస్తుకు గాను కావాల్సిన కులం, ఆదాయ ధ్రువపత్రాలు అవసరం ఉన్న క్రమంలో వాటిని పొందేందుకు ఆలస్యం అవుతున్న సందర్భంగా దరఖాస్తు తేదీని పొడిగించాలన్నారు. కొత్తగా ఏర్పడిన అక్కన్నపేట మండలం చూపించడం లేదన్నారు.

కూల్చివేతలు సరే.. నిర్మాణాలు ఎప్పుడో?

బీజేవైఎం జిల్లా కార్యదర్శి మనోజ్‌కుమార్



కూల్చివేసిన జీపీ భవన స్థలాన్ని పరిశీలిస్తున్న మనోజ్‌కుమార్

మద్దూరు(హుస్నాబాద్): భవనాలను కూల్చివేస్తూ బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి అని చెప్పుకోవడం సరికాదని బీజేవైఎం జిల్లా కార్యదర్శి సోగాల మనోజ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని లద్నూరు గ్రామంలో గతంలో కూల్చివేసిన గ్రామ పంచాయతీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు నెలల క్రితం జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి నూతన జీపీ భవనానికి భూమిపూజ చేసి నెలలు గడుస్తున్నా ఎలాంటి పనులు ప్రారంభం కాకపోవడమే బీఆర్ఎస్ పార్టీ చేసే అభివృద్ధికి నిదర్శనమన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యే మాటకే విలువ లేకుంటే సామాన్య ప్రజల సమస్యలను పాలకవర్గం ఎలా పరిష్కరిస్తుందన్నారు. ఇంతకుముందు గ్రామ పంచాయతీ భవనం ఎలాంటి శిథిలావస్థకు గురి కాకుండానే భవనాన్ని పాలకవర్గం ఉత్సాహంతో ఎలాంటి తీర్మానం లేకుండా కూల్చివేశారని తెలిపారు. నూతన భవనం నిర్మించకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురుతున్నారన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి వెంటనే నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం నిర్మించే విధంగా చొరవ చూపి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో బీఆర్ఎస్ నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే పహిల్వాన్ దారుణ హత్య

వర్కర్ తరఫున అడిగేందుకు వెళ్లి హతమయ్యాడు



మక్బూల్(ఫైల్)

జహీరాబాద్: పట్టణంలో ఓ పహిల్వాన్‌ను పట్టపగలే కొందరు హత్యచేశారు. పోలీసుల కథనం ప్రకారం..సోమవారం మధ్యాహ్నం జహీరాబాద్‌లోని వసత్‌బాగ్‌కాలనీకి చెందిన మక్బూద్ పహిల్వాన్(35)ను పండ్ల మార్కెట్ సమీపంలో ఉన్న హోటల్‌లో కూర్చున్న సమయంలో కొందరు దుండగులు తల్వార్‌లతో దాడిచేసి మెడపై తీవ్రంగా గాయపర్చారు. మెడ, మొండెం వేరు అయ్యి తీవ్ర రక్తస్రావం కావడంతో మక్బూద్ అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనాస్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మక్బూద్ శ్రీరాంకాలనీలో జువెల్లరీ వ్యాపారం చేసేవాడని పోలీసులు పేర్కొన్నారు. మక్బూద్ దుకాణంలో పనిచేస్తున్న హోతి(కె) గ్రామానికి చెందిన అతిక్ అదే గ్రామానికి చెందిన షౌకత్ వద్ద రూ.2లక్షలు అప్పు తీసుకున్నాడు. కొంత కొంత చెల్లిస్తూ వచ్చాడు. ఆ అప్పుకు వడ్డీ వేస్తూ రూ.60వేలు చెల్లించాలని అతిక్‌ను డిమాండ్ చేశాడు. ఈ విషయాన్ని అతిక్ తన యజమాని మక్బూద్‌కు చెప్పాడు. ఈ విషయమై షౌకత్‌కు ఫోన్ చేసి వడ్డీలు అతిగా వేయడం సరైంది కాదని నిలదీశాడు. ఎక్కడ ఉన్నావు వచ్చి మాట్లాడతా అని మక్బూద్ షౌకత్‌తో అన్నాడు. పండ్ల మార్కెట్ వద్ద ఉన్నా రమ్మని చెప్పాడు. అప్పటికే షౌకత్ తన సంబంధీకులైన తాజ్‌బాబా, నవాజ్, ఫెరోజ్‌లను సిద్ధం చేసి ఉంచాడు. అక్కడకు చేరుకున్న మక్బూద్‌పై కత్తులతో దాడి చేసి హత్య చేశారు. హతుడు మక్బూద్ 2008 సంవత్సరంలో పంజగుట్టలో సుపారీ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. హత్యకు పాల్పడ్డవారిని అరెస్టు చేసేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. పట్టణంలో పట్టపగలే హత్య సంఘటన చోటు చేసుకోవడంతో ప్రజలు కలవరానికి గురయ్యారు. జహీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

రెండు గ్రామాల్లో దొంగల బీభత్సం



రామునిపట్లలో ఓ ఇంట్లో బీరువా పగుల గొట్టిన దృశ్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోని ఇబ్రహీంనగర్, రామునిపట్ల గ్రామాల్లో దొంగలు బీభత్సం సృష్టించారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. గ్రామస్తులు, బాధితుల వివరాల ప్రకారం.. ఇబ్రహీంనగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో ఉంటున్న బండి కృష్ణ ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి తులం బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి గొలుసులు, ఆనరాసి కనకవ్వ ఇంట్లో 7 తులాల బంగారం, 18 తులాల వెండి గొలుసులు ఎత్తుకెళ్లారు. చెప్యాల లచ్చవ్వ ఇంట్లో 20 తులాల వెండి గొలుసులు, రూ.5వేల నగదు అపహరించారు. రామునిపట్ల గ్రామానికి మేడ శ్రీనివాస్ ఇంట్లో 3 గ్రాముల బంగారం, 5 తులాల వెండి, మేడ చంద్రంలో ఇంట్లో రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

ఆగిఉన్న బస్సును ఢీ కొట్టిన టిప్పర్



బస్సును ఢీకొన్న టిప్పర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆగిఉన్న ఆర్టీసీ బస్సును ఓ టిప్పర్ ఢీకొట్టింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హకీంపేట్ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు లింగంపల్లి నుంచి పటాన్‌చెరు వైపు వెళుతోంది. రామచంద్రాపురం వద్ద ఓ లారీ యూటర్న్ తీసుకుంటుంది. ఆ సమయంలో బస్సు డ్రైవర్ సత్యనారాయణ బస్సును ఆపాడు. ఈ క్రమంలో ఆగిఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ బస్సును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ సత్యనారాయణ, కండక్టర్ వినోద్‌లు గాయాలపాలయ్యారు. టిప్పర్ డ్రైవర్ పరారుకాగా, టిప్పర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కారు బోల్తా.. స్వల్పగాయాలు



పాక్షికంగా దెబ్బతిన్న కారు

దుబ్బాకరూరల్: మద్దూరు మండల ఎస్‌ఐ నారాయణ తన స్వగ్రామమైన మిరుదొడ్డి మండలం మల్లుపల్లికి కారులో వస్తున్నారు. ఈ మార్గమధ్యంలో సిద్దిపేట-రామాయంపేట జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. రోడ్డు గుంతలమయంగా ఉండడంతో ఎస్‌ఐ కారు బోల్తా పడింది. దీంతో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్‌ఐని ప్రైవేట్ వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారు పాక్షికంగా దెబ్బతిన్నది.

బాలుడి ఆత్మహత్య



సంకు శివకుమార్(ఫైల్)

పెద్దశంకరంపేట(మెదక్): ఓ బాలుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అల్లాదుర్గం సీఐ జార్జ్, ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం...పెద్దశంకరంపేటలోని ఇందిరాకాలనీకి చెందిన శంకర్– లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇందులో పెద్దవాడైన శివకుమార్(14) మోడల్‌స్కూల్‌లో 6వతరగతి పూర్తి చేశాడు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడాడు. తండ్రి శంకర్ అనారోగ్యంతో బాధపడుతుండగా, చికిత్స కోసం లక్ష్మితో కలిసి ఆదివారం ఆస్పత్రికి వెళ్లి సోమవారం ఉదయం ఇంటికి వచ్చారు. శివకుమార్ కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళుతుండగా, చుట్టుపక్కలవారు వీరి ఇంటి పక్కన ఉన్న మరోగదిలో శివకుమార్ ఉరివేసుకొని చనిపోయినట్టు గుర్తించి సమాచారం అందించారు. శివకుమార్ ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న అనంతరం బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మామిడిలో లాభాలు రాలేదని..



మసూర్‌ధార్ జాఫర్(ఫైల్)

ఝరాసంగం(జహీరాబాద్): మామిడితోటలో సరైన లాభాలు రాలేదని ఓ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని పొట్టిపల్లి గ్రామానికి చెందిన మసూర్‌ధార్ జాఫర్ (38) మామిడి చెట్లు కౌలుకు తీసుకొని వ్యాపారం చేస్తున్నాడు. మామిడి వ్యాపారంలో సరైన లాభాలు రాక నష్టాలు వచ్చాయి. నష్టం రావటంతో ఆర్థిక స్థితులు బాగాలేక జీవితంపై విరక్తి చెంది చనిపోవాలని అనుకున్నాడు. ఈ క్రమంలో సోమవారం మామిడి తోటకు వెళ్తున్నానని చెప్పి, ఎల్గోయి గ్రామ శివారులోని నిమ్జ్ ప్రాంతంలోని వేప చెట్టుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుడి భార్య షహీన్ సుల్తానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ రాజేందర్‌రెడ్డి చెప్పారు.

చికిత్స పొందుతున్న ఐదుగురి మృతి

వేర్వేరు ఘటనల్లో గాయపడిన ఐదుగురు చికిత్స పొందుతూ మృతి చెందారు.

పేలుడులో గాయపడిన ఇద్దరు

పటాన్‌చెరు టౌన్: బీడీఎల్ సీఐ వినాయక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక వాడలో ఆర్‌వీ ఇంజనీరింగ్ పరిశ్రమలో శనివారం పేలుడు సంభవించడంతో అక్కడ పనిచేస్తున్న ప్లాంట్ ఇన్‌చార్జ్ రమణారెడ్డితో పాటు సతీష్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు తీవ్రంగా గాయపడగా, విజయ్‌సింగ్ స్వల్పంగా గాయపడిన విషయం తెలిసిందే. ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, వెంకటేశ్వరరావు, సతీష్‌రెడ్డిలు ఆదివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాలను సోమవారం పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ...



వరలక్ష్మి (ఫైల్)

పటాన్‌చెరు ఎస్‌ఐ దుర్గయ్య తెలిపిన వివరాల ప్రకారం..హత్నూర మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన గణేశ్ అతని భార్య వరలక్ష్మి(35) మే 4వ తేదీన సాయంత్రం ఊరి నుంచి పటాన్‌చెరు వైపు బైక్‌పై వస్తుండగా ఇంద్రేశం సాయికాలనీ సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి టిప్పర్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ వరలక్ష్మిని హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ...



గుర్తు తెలియని మృతదేహం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల గ్రామ సమీపంలోని టోల్‌గేట్ వద్ద నడుచుకుంటూ వెళుతున్న ఓ వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఆదివారం సాయంత్రం ఢీకొట్టింది. దీంతో అతను తీవ్రంగా గాయపడగా, సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని ఎస్‌ఐ విజయకృష్ణ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 53ఏళ్లు ఉంటుందని, మృతదేహం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉందన్నారు.

నీటిలో దూకి గాయపడి...

పాపన్నపేట(మెదక్): ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన శ్రీధర్‌సబార్(22) సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో ఓ పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఆదివారం బంధువు వినోద్ స్నేహితులతో పాటు ఏడుపాయలకు వచ్చాడు. దర్శనం అనంతరం ఆలయ సమీపంలో వనదుర్గ ప్రాజెక్టు వద్దకు వెళ్లి ఈతకోసం నీటిలో దూకేందుకు ప్రయత్నించగా తలకు తీవ్రగాయాలయ్యాయి. స్నేహితులు మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు కేసునమోదు చేసి పోస్టుమార్టం చేసి బంధువులకు సమాచారం అందించినట్లు తెలిపారు.